క్లుప్తంగా

నిజామాబాద్-లోకేశ్వరం బస్సు ప్రారంభం



ఖలీల్‌వాడి: నిజామాబాద్ నుంచి నందిపేట్, సీహెచ్ కొండూర్, పంచ్గుడి, ధర్మోర, మొహాల్ల మీదుగా లోకేశ్వరానికి బస్సు సర్వీసును రీజినల్ మేనేజర్ ఉషాదేవి, డిపో-1 మేనేజర్ ఆనంద్ శనివారం ప్రారంభించారు. నిజామాబాద్ నుంచి లోకేశ్వరానికి ఉదయం 7:15, లోకేశ్వరం నుంచి నిజామాబాద్ సాయంత్రం 06.10 గంటలకు బయలుదేరుతుందని వారు తెలిపారు. అలాగే నందిపేట్ నుంచి లోకేశ్వరం ఉదయం 08.15, 10.30 మధ్యాహ్నం 01.00, 03.00, సాయంత్రం 05.10 గంటలకు, లోకేశ్వరం నుంచి నందిపేట్ ఉదయం 09.20, 11.45, మధ్యాహ్నం 02.00, 04.00, సాయంత్రం 06.10. గంటలకు నడుపబడునని తెలిపారు. ఈసౌకర్యాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు..



ధర్పల్లి: మండలంలోని సీతాయిపేట్, హోన్నాజీపేట్, నడిమితాండాలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఎంపీపీ సారిక హనుమంతురెడ్డి ప్రారంభించారు. ఐకేపీ ఏపీఎం సునీత, నాయకులు చిన్నారెడ్డి, ధరావత్ గోపాల్, రాములు తదితరులున్నారు.

జుక్కల్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా రామర్తి గోపి



ఖలీల్‌వాడి: నగరానికి చెందిన రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రామర్తి గోపిని జుక్కల్ నియోజకవర్గం ఇన్‌చార్జిగా నియామిస్తూ శనివారం పార్టీ అధిష్ఠానం ఉత్తర్వులు జారీ చేసింది. ఈసందర్భంగా జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, జాతీయ నాయకులు కొప్పుల రాజు, రాజేష్ ఎల్‌డీఎంఆర్‌సీ జాతీయ సమన్వయకర్త పులి అనిల్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవం



సిరికొండ: మండలంలోని రావుట్ల గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వైస్ ఎంపీపీ రాజన్న, సర్పంచ్ భూదేవ్వ రాజన్న పాల్గొన్నారు.

పేద కుటుంబానికి చేయూత



నిజామాబాద్‌నాగారం: బాల్కొండ మండలం చిట్టాపూర్ గ్రామానికి చెందిన ఉమాదేవి సత్యనారాయణల కుమారుడు అర్షిత్(3)కు ఇటీవల బ్రేయిన్ ట్యూమర్ ఆపరేషన్ జరిగింది. దీంతో శనివారం శ్రీ లక్ష్మి చేయూత సంస్థ ప్రతినిధులు అర్షిత్ తల్లిదండ్రులకు రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. అధ్యక్షుడు వంగల రమణాచారి, లక్ష్మణ్, భూషణ్‌చారి, శ్యామ్, రవీందర్, సురేందర్ పాల్గొన్నారు.



సుభాష్‌నగర్: నగరానికి చెందిన అజయ్ అనే వ్యక్తి ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ బాధితుడిని పరామర్శించారు.తక్షణ సాయంగా ధన్‌పాల్ లక్ష్మీబాయి విఠల్‌గుప్త చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.25వేలను అందజేశారు.

డబుల్ ఓటర్ల ఏరివేత షురూ!

- నగరంలో 28బృందాలు, 281మంది బీఎల్‌వోలతో ఇంటింటికీ సర్వే
- 19వేల డబుల్ ఓటర్ల గుర్తింపు



మున్సిపాలిటీలోని పౌర సేవా కేంద్రం

నిజామాబాద్‌నాగారం: మున్సిపాలిటీ పరిధిలో డబుల్ ఓటర్ల ఏరివేత ప్రక్రియ షురూ అయ్యింది. కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్లలో 19వేల డబుల్ ఓటర్లు ఉన్నట్లు మున్సిపల్ అధికారులు గుర్తించారు. దీంతో 28టీంలు 281బూత్ లెవల్ ఆఫీసర్(బీఎల్‌వో)లతో ఇంటింటికీ తిరుగుతూ సర్వే చేపట్టారు. వారం రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయడానికి కసరత్తులు చేస్తున్నారు.

మొత్తం ఓటర్లు 2లక్షల 68వేలు..

నగరంలో 60 డివిజన్లు ఉన్నాయి. 3.99లక్షల జనాభా ఉంది. మొత్తం ఓటర్లు 2లక్షల 68వేలు ఉన్నారు. ఇందులో పురుషులు 1,30,308 మంది, మహిళలు- 1,37,555 మంది ఉన్నారు. ఇతరులు 14మంది ఉన్నారు. ఈ సంవత్సరం 18 ఏళ్ల నిండిన ఓటర్లు 2,832ఉన్నారు. అయితే నగర పరిధిలో 19వేల డబుల్ ఓటర్లు ఉన్నారు. అంటే ఒక్కో వ్యక్తిపైన రెండు ఓటర్ ఐడికార్డులు ఉన్నట్లు ఎన్నికల అధికారులు గుర్తించారు. వీటిని ఏరివేసే పనిలో మున్సిపల్ రెవెన్యూ అధికారులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లను పరిశీలిస్తున్నారు. డబుల్ ఓటర్ల విషయంలో ఓటర్లకు అవగాహన కల్పిస్తు ఏరవేత చేపట్టారు. ఓటర్ల నమోదు, కార్డులో తప్పుఒప్పులు ఇలా తదితర సమస్యలు ఉంటే నేరుగా మున్సిపాలిటీ కార్యాలయంలోని పౌర సేవా కేంద్రంలో సంప్రదించాలని రెవెన్యూ అధికారులు తెలిపారు. కొత్తగా ఓటు నమోదు చేసుకునే యువతీయువకులు సైతం సమాచారం కోసం ఈ హెల్ప్‌డెస్క్, మీ సేవాల్లో సంప్రదించాలన్నారు. అభ్యంతరాల విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదంటున్నారు.

వారం రోజుల్లో ప్రక్రియ పూర్తి..

డబుల్ ఓటర్ల విషయంలో వారం రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయడానికి చర్యలు తీసుకున్నాం. ఇప్పటికే బీఎల్‌ఓస్ ఇంటింటికీ తిరుగుతూ, పరిశీలన చేపట్టారు. డబుల్ ఓటర్ల ఏరివేత వారం రోజుల్లో పూర్తి చేస్తాం. ఓటర్లకు ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా మున్సిపల్ కార్యాలయంలోని పౌర సేవా కేంద్రంలో సంప్రదించవచ్చు.

– నరేందర్, ఆర్‌ఐ, రెవెన్యూ, నిజామాబాద్

బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై విమర్శలు తగవు



ముబారక్‌నగర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్

- ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్
- ముబారక్‌నగర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నిజామాబాద్ సిటీ: ప్రతి గ్రామంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపడుతున్నా.. బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం తగదని రూరల్ ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ పేర్కొన్నారు. నిజామాబాద్ రూరల్ మండలం ముబారక్‌నగర్(18వ డివిజన్)లో శనివారం పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆర్టీసీ చైర్మన్ మాట్లాడుతూ.. ముబారక్‌నగర్ గ్రామ పంచాయతీ ఉండగా నిధులు వచ్చేవి కావని, మున్సిపల్‌లో విలీనం కావటంతో కోట్లాది రూపాయల నిధులు వచ్చాయని తెలిపారు. గ్రామంలో వచ్చే విడతలో దళితబంధు పథకం మంజూరు చేస్తామని తెలిపారు. అభివృద్ధి పనులు చేస్తున్నా కేసీఆర్, కేటీఆర్, కవితలపై, రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేయటం తగదని, వారికి ప్రజలే గుణపాఠం చెప్పాలన్నారు. జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, కార్పొరేటర్లు యమున అనిల్, శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సాయిలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో బీఆర్‌ఎస్ జెండా ఎగరాలి

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 25న నిర్వహించే ప్లీనరీ సమావేశం సందర్భంగా రూరల్ నియోజకవర్గంలోని ప్రతీ గ్రామంలో పార్టీ జెండా ఎగురవేయాలని ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పిలుపునిచ్చారు. నగరంలోని తన నివాసంలో శనివారం ఆయన మాట్లాడారు. రూరల్ నియోజకవర్గ ప్లీనరీ సమావేశం బోర్గాం(పి) శివారులోని భూమారెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు.

నిధుల మంజూరుపై హర్షం..

జక్రాన్‌పల్లి: మండలంలోని చాంద్‌మియాబాగ్ 44వ నెంబర్ జాతీయ రహదారి నుంచి చేంగల్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ నిధులు మంజూరు చేశారు. దీంతో శనివారం నిజామాబాద్‌లోని తన స్వగృహంలో పడకల్ గ్రామ ప్రజాప్రతినిధులు, వీడీసీ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి, కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా పడకల్‌లో భారీ వర్షాల కారణంగా తెగిపోయిన చెరువు కట్ట మరమ్మతులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యేను కోరారు. సర్పంచ్ పుప్పాల శ్రీనివాస్, ఉపసర్పంచ్ రిత్విక్, ఎంపీటీసీ గంగారెడ్డి, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు





ధర్పల్లిలో ఈద్గా వద్ద ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు.. ఇందల్వాయి మండల కేంద్రంలో..



నడిపల్లిలో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న పీసీసీ రాష్ట్ర కార్యదర్శి నగేష్‌రెడ్డి

సాక్షి నెట్‌వర్క్: నిజామాబాద్ రూరల్, అర్బన్ నియోజకవర్గాల్లో శనివారం ముస్లింలు రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలు నగరంతోపాటు మండలాలు, గ్రామాల్లోని ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కుటుంబసభ్యులు, బంధుమిత్రులతో కలిసి విందు భోజనాలు ఆరగించారు. నగరంలోని ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ నివాసంలో మైనార్టీలతో కలిసి వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందని పేర్కొన్నారు. నడిపల్లి శివారులోని ఈద్గా వద్ద టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి, ఏఎంసీ మాజీ చైర్మన్ కాటిపల్లి నగేష్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్, మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, ఎంపీటీసీ సీహెచ్‌నర్సయ్య, లక్ష్మణ్ ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. నగరంలోని ఈద్గాలో ప్రార్థనలు చేసిన తర్వాత ఉపన్యాసంలో రాజకీయాల ప్రస్తావన తీసుకురావడం సరైనది కాదని కాంగ్రెస్ సీనియర్ నేత సయ్యద్ కైసర్ అన్నారు. ఉపన్యాసంలో ప్రజాప్రతినిధులతో మాట్లాడించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు.



జక్రాన్‌పల్లిలో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రజాప్రతినిధులు



సిరికొండ మండలం కొండాపూర్‌లో శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ముస్లింలు





నగరంలోని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నేతలు.. టీఎన్‌జీవో ప్రతినిధులు



జక్రాన్‌పల్లిలో ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు..



రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డితో మైనార్టీ నాయకులు

లెనిన్‌కు ఘన నివాళి



సిరికొండలో నినాదాలు చేస్తున్న ప్రజాపంథా నాయకులు

ఖలీల్‌వాడి/సిరికొండ: నగరంతోపాటు సిరికొండ మండలంలో సీపీఐ (ఎంఎల్), సీపీఐఎంఎల్ ప్రజా పంథా, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు శనివారం రష్యా విప్లవ నాయకుడు లెనిన్‌కు ఘన నివాళులు అర్పించారు. లెనిన్ జయంతి సందర్భంగా పార్టీ ఆవిర్భావ దినో త్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా లెనిన్ చి త్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే పార్టీ జెండాను ఆవిష్కరించారు. సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య, రామకృష్ణ, బాబన్న, సాయారెడ్డి, రాములు, నరేష్, గంగారం, భూమయ్య, కృష్ణ, ఓమయ్య, సుధాకర్ ఉన్నారు.





నగరంలో జెండాను ఎగురవేస్తున్న సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు.. సీపీఐ ఆధ్వర్యంలో..

25న బీఆర్‌ఎస్ ప్రతినిధుల సభ

వేల్పూర్: కమ్మర్‌పల్లిలోని లలిత గార్డెన్‌లో ఈనెల 25న బీఆర్‌ఎస్ ప్రతినిధుల సభ నిర్వహించనున్నట్లు, పార్టీ శ్రేణులు సభను విజయవంతం చేయాలని జిల్లా ఆర్టీఏ సభ్యుడు రేగుల్లరాములు కోరారు. వేల్పూర్ సొసైటీ ఆవరణలో శనివారం నిర్వహించిన మండల బీఆర్‌ఎస్ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సభకు మండలంలోని బీఆర్‌ఎస్ నాయకులు, ప్రతినిధులు తరలిరావాలన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	61,300	వెండి (కిలో)	74,500
22 క్యారెట్స్	56,547		

– నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	6	12	క్యాప్సికం	40	60
బెండకాయ	30	50	గాజరుగడ్డ	15	30
జీరకాయ	30	50	పచ్చిమిర్చి	30	50
దొండకాయ	20	40	దోసకాయ	15	30
బీర్నీసుకాయ	60	80	ఆలుగడ్డ	15	30
కాకరకాయ	40	60	గోజుగడ్డ	10	20
వంకాయ	15	30	గోబిపువ్వు	25	50
పాలకూర	20	40	బీట్‌రూట్	25	50
మెంతికూర	50	70	గోరు చిక్కుడు	50	70
కొత్తిమీర	35	60	చిక్కుడుకాయ	30	50
పుదీనా	20	40			

– ఇందూరు

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	220
		లైవ్	180
స్కిన్‌లెస్	260	మటన్	750

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏపియన్)
స్క్రీన్-1- విరూపాక్ష - 1.25 7.35 10.35 శాకుంతలం-4.30
స్క్రీన్-2- దసరా-1.35 7.25 ఈవిల్ డెడ్ రైజ్(ఇంగ్లీష్)-4.35 10.25
స్క్రీన్-3- కిసి కా భాయ్ కిసి కీ జాన్ (హిందీ) 10.45, 1.40, 4.25, 7.30, 10.20

పీటీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)
స్క్రీన్-1- కిసి కా భాయ్ కిసి కీ జాన్ (హిందీ) 10.05, 1.15, 4.25, 7.35, 10.45
స్క్రీన్-2- కిస్ కా భాయ్ - కిసి కీ జాన్(హిందీ)-12.05 6.20 9.30 విరూపాక్ష -3.15
స్క్రీన్-3- కిస్ కా భాయ్- కిసి కీ జాన్(హిందీ)-10.40 విడుదల పార్ట్-1 -1.50 చెంగిజ్(హిందీ)-4.55 ఈవిల్ డెడ్ రైజ్(ఇంగ్లీష్) -8.10 విరూపాక్ష -10.30
స్క్రీన్-4- ఈవిల్ డెడ్ రైజ్(ఇంగ్లీష్) -11.10 10.05(రాత్రి) శాకుంతలం-1.30 దసరా -4.35 హలో మీరా -7.50

దేవి — రావణాసుర
నటరాజ్ — కిసి కా భాయ్-కిసి కీ జాన్(హిందీ)
లలితామహల్ — దసరా
విజయ్ — విరూపాక్ష

ఆధ్యాత్మికం

నగరంలో పరశురామ జయంతి



నిజామాబాద్ సిటీ: నగరంలోని రాజస్థానీ భవన్‌లో రాజస్థానీ బ్రాహ్మణ సమాజ్, రాజస్థానీ బ్రాహ్మణ యువమంచ్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం అక్షయ తృతీయ పర్వదినాన్ని పురస్కరించుకుని భగవాన్ పరశురామ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనివాస్ తివారీ పరశురాంజీ స్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం భగవాన్ పరశురాంజీ ధైర్యసాహసాలను చాటిచెప్పారు. సమాజ్ అధ్యక్షుడు అశోక్ దైమా, మంత్రి జుగల్ కిషోర్ పాండే, సత్యనారాయణ నాగ్లా, అశోక్ శర్మ, రాజేష్ పురోహిత్, కిషోర్ తివారీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ ఆలయ ఉత్సవాలు

ఇందల్వాయి: సిర్నాపల్లి గ్రామంలో శనివారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవాలు, రజక సంఘం ఆధ్వర్యంలో మడివేలు స్వామి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలను ఊరేగించి దేవతలకు నైవేద్యం సమర్పించారు. ఆలయాల్లో పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు.



అమరవీరులకు నివాళులు

ఆర్మూర్‌టౌన్: ఉగ్రదాడిలో అమరులైన ఆర్మీ జవాన్లకు శనివారం పట్టణంలోని క్లాక్ టవర్ జాతీయ జెండా వద్ద బీజేపీ నాయకులు కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. జవాన్ల ఆత్మకు శాంతి కలగాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి నర్సింహారెడ్డి, పట్టణ అధ్యక్షుడు జెస్సు అనిల్, మోర్చా నాయకులు పాల్గొన్నారు.

రక్తదానం సామాజిక అవసరం



నిజామాబాద్‌నాగారం/నిజామాబాద్ సిటీ: రక్తదానం సామాజిక అవసరమని, ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని ఏసీపీ కిరణ్ కుమార్ పేర్కొన్నారు. ఇందూరు యువత స్వచ్ఛంద సేవాసంస్థ రూరల్ మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం పాల్ద గ్రామంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏసీపీ కిరణ్ కుమార్ హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ప్రతి ఒక్కరు సామాజిక సేవలో ముందుండాలని ఏసీపీ పిలుపునిచ్చారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దుకూరి సాయిబాబు, ఎంపీటీసీ నరేష్, వీడీసీ సభ్యులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.